సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



అప్‌గ్రేడ్ కాక.. సౌకర్యాలు లేక!

పాల్వంచ సీహెచ్‌సీలో సరైన సౌకర్యాలు లేక వైద్య సేవలు అంతంతగానే అందుతున్నాయి. దీంతో బాధితులు ఇబ్బంది పడుతున్నారు. 8లో



..ఇటు పంచాయతీ

పాల్వంచలో జీసీసీ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు మున్సిపల్, పంచాయతీ సరిహద్దు సమస్యతో ఎన్‌ఓసీ అందడం లేదు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 28° / 24°

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన, మంత్రపుష్పం, హారతి సమర్పించారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ పాల్గొన్నారు. కాగా, ఆలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ రజనీకుమారి తెలిపారు. హాజరు కానున్న మహిళా భక్తులు రూ.216 చెల్లిస్తే, వారికి ఆలయం తరఫున పూజా సామగ్రి అందజేస్తామని పేర్కొన్నారు.

కేసులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా జడ్జి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టులో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గంజాయి కేసులపై ఉక్కుపాదం మోపాలని, పాత కేసుల్లో వారెంట్‌లు అమలు పరచాలని అన్నారు. ముద్దాయిలకు త్వరితగతిన సమన్లు అందజేయాలని సూచించారు. చెక్‌బౌన్స్ కేసులో త్వరగా సమన్లు అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి.వేణుగోపాల్, న్యాయమూర్తులు జి. భానుమతి, ఎ.సుచరిత, కె.సాయిశ్రీ, వి.శివనాయక్, పీపీలు పోసాని రాధాకృష్ణమూర్తి, వెలగల నాగిరెడ్డి, రావి విజయ్‌కుమార్, ఎస్.లావణ్య, బి.విశ్వశాంతి, నాగలక్ష్మి, భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాళ్ల అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

కొత్తగూడెంఅర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేషుబాబు, ఉపాధ్యక్షుడిగా సత్యప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, సహాయ కార్యదర్శిగా కృష్ణయ్య, మహిళా కార్యదర్శిగా కల్పన, కోశాధికారిగా కత్తి రమేష్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గానికి డీఐఈఓ ఎ. వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు జాస్తి రమేష్ బాబు, బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మెడికల్ బోర్డ్‌లో 186 మంది ఇన్‌వాలిడేషన్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో బుధ, గురువారాల్లో నిర్వహించిన మెడికల్ బోర్డ్‌లో 186 మంది ఇన్‌వాలిడేషన్ అయ్యారు. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని 238 మందికి కాల్ లెటర్లు పంపించగా 207 మంది హాజరయ్యారు. వీరిలో 186 మంది ఇన్‌వాలిడేషన్ కాగా, 12 మందిని ఉన్నత స్థాయి పరిశీలనకు పంపించారు. అయితే అన్‌ఫిట్ అయిన వారి వివరాలను కార్యాలయంలో ప్రదర్శించాలనే కార్మికుల కోరికను నిరాకరించారు. కాగా, 78 శాతం మంది అన్‌ఫిట్ కావడం వెనుక పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల కళాశాలలో నేడు స్పాట్ అడ్మిషన్లు

బూర్గంపాడు: స్థానిక తెలంగాణ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీ సీట్ల భర్తీకి నేడు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని, పదో తరగతిలో 6.5 జీపీఏ సాధించిన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

జిల్లా కేంద్రంలో ఇష్టారీతిన అక్రమ నిర్మాణాలు

- కబ్జాకు గురవుతున్న నాలాలు, డ్రెయినేజీలు
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం
- అక్రమార్కులకు తెర వెనుక 'ఖద్దరు' మద్దతు
- హైడ్రా తరహాలో అడ్డుకోవాలంటున్న కొత్తగూడెం వాసులు

కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం



'గూడెం' గడ్డ.. అక్రమార్కుల అడ్డా!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: హైడ్రా.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది రాజకీయ ప్రముఖులు, అధికారులు, బడా వ్యాపారవేత్తల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న పదం. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తరహాలో మా ఊళ్లో కూడా ఒక సంస్థ రావాలంటూ సోషల్ మీడియా వేదికగా ఎక్కడికక్కడ ప్రజలు తమ అభిలాషను వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కొత్తగూడెం వాసులు కూడా ఈ డిమాండ్‌ను బలంగా వినిపిస్తున్నారు. జిల్లా కేంద్రంగా మారిన తర్వాత ఇక్కడ అనేక అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. అయితే నిబంధనలు ఉల్లంఘించే వారికి మున్సిపాలిటీ అధికారులు కేవలం నోటీసులు ఇవ్వడమే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అక్రమ నిర్మాణాలు నెలకో ఫ్లోర్ చొప్పున పెరుగుతూనే ఉన్నాయి.

రాజకీయ ఒత్తిళ్లు..

కొత్తగూడెం అభివృద్ధి, ప్రజల సౌకర్యాల కల్పన అంటూ నిత్యం చెప్పే కొందరు రాజకీయ నాయకులు ఈ తరహా అక్రమ నిర్మాణాలకు అండగా ఉంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కళ్లెదుటే నిబంధనల ఉల్లంఘన జరిగిందని స్పష్టంగా అర్థం అవుతున్నా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చర్యలు తీసుకునే పరిస్థితి లేదని కొందరు అధికారులు ఆఫ్ ది రికార్డ్‌గా చెబుతున్నారు. చర్యలు తీసుకుంటే రాజకీయ ఒత్తిళ్లు.. తీసుకోకుంటే తమ కెరీర్‌పై మచ్చ పడే ప్రమాదం ఉండడంతో కొత్తగూడెంలో పని చేయడం తమకు సవాల్‌గా మారిందని అంటున్నారు. హైడ్రా లాంటి కఠిన వ్యవస్థలు అమల్లోకి వస్తేనే ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుందని చెబుతున్నారు.

అక్రమ కట్టడాల చిట్టాలో కొన్ని..

- కొత్తగూడెంలోని బస్టాండ్ ఎదురుగా గత నాలుగు నెలలుగా ఓ భవన నిర్మాణం సాగుతోంది. జాతీయ రహదారి వెంట నిర్మిస్తున్నందున నిబంధనల ప్రకారం ప్రధాన రోడ్డు వైపు 20 అడుగులు, మున్సిపల్ గల్లీ వైపు ఐదు అడుగులు వదిలేసి ప్రహరీ నిర్మించాలి. ఇక ప్రధాన భవనం ప్రవేశం వైపు మూడు మీటర్లు (10 అడుగులు), మిగిలిన మూడు వైపులా రెండు మీటర్లు (ఏడు అడుగులు) వదిలేయాల్సి ఉంటుంది. అంటే 400 గజాల స్థలంలో నిబంధనలు పాటిస్తూ 175 గజాల్లోనే భవన నిర్మాణానికి అనుమతులు జారీ అయ్యాయి. కానీ క్షేత్రస్థాయిలో పనులు ఇందుకు పూర్తి విరుద్ధంగా సాగుతున్నాయి. పట్టణంలో అక్రమ కట్టడాలపై మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామిని వివరణ కోరగా.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వాటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.
- పోస్టాఫీస్ దగ్గర మున్సిపల్ కార్యాలయం సమీపంలో కొత్తగా ఓ రెస్టారెంట్ నిర్మిస్తున్నారు. దీనికి అనుమతి తీసుకున్నది ఒక రకంగా అయితే నిర్మాణం మరోలా జరిగింది. ఇక్కడ జాతీయ రహదారిపై డ్రెయినేజీ మీదుగా రెస్టారెంట్‌కు సంబంధించిన షెడ్డు నిర్మించారు. దీంతో డ్రెయినేజీ ఆనవాళ్లు లేకుండా చేశారు.
- రైల్వే స్టేషన్ నుంచి న్యూగొల్లగూడెం వెళ్లేదారిలో నాలుగు అంతస్తులతో వాణిజ్య అవసరాల కోసం ఓ భవనం నిర్మించారు. దాదాపు రెండేళ్ల కిందటే నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. నాలుగు వైపులా సెట్‌బ్యాక్ విషయంలోనూ జాగ్రత్తలు పాటించలేదు. ఫైర్ సేఫ్టీ, పార్కింగ్ వంటి వాటిలోనూ నిబంధనలు గాలికొదిలేశారు.
- గణేశ్ టెంపుల్ గల్లీలో నిర్మించిన ఓ వాణిజ్య భవనానిదీ ఇదే పరిస్థితి. జిల్లాలో గతంలో పని చేసిన ఓ ఉన్నతాధికారి ఈ భవన నిర్మాణంపై కన్నెర్ర చేశారు. ఆయన బదిలీపై వెళ్లిపోగానే షరా మామూలే అన్నట్టుగా పరిస్థితి మారింది.

అద్దెకు వెనకడుగు

జిల్లా కేంద్రంగా మారిన తర్వాత అనేక బడా వాణిజ్య సంస్థలు కొత్తగూడెంలో తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ఆసక్తి చూపించాయి. అయితే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలే ఎక్కువగా ఉండడంతో వాటిని అద్దెకు తీసుకోవడానికి ప్రముఖ వ్యాపార సంస్థలేవీ ఆసక్తి చూపించడం లేదు. అక్రమ నిర్మాణం కావడంతో న్యాయపరమైన చిక్కులు ఒక సమస్య అయితే.. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే దాని వల్ల ఏర్పడే నష్టం కూడా కోలుకోలేని విధంగా ఉంటుందనే భయాలు ఈ తరహా అక్రమ నిర్మాణాలకు శాపంగా మారాయి. మున్సిపాలిటీలోనే కాదు.. పట్టణంలో భాగంగా ఉన్న చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలోని అర్బన్ ప్రాంతాల్లోనూ ఈ సమస్య ఉంది. దీంతో ఆశించిన రీతిలో ఇక్కడికి పెట్టుబడులు రాక ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి.

అన్నదాతకు అందని 'భరోసా'

- పెట్టుబడికి డబ్బుల్లేక రైతుల ఇక్కట్లు
- పథకం అమలుపై అభిప్రాయ సేకరణతో హడావిడి
- అదను దాటుతున్నా దక్కని సాయం



పత్తిలో పురుగుమందు స్ప్రే చేస్తున్న రైతు

బూర్గంపాడు: పంటల సాగుకు రైతులకు గత ప్రభుత్వం రైతుబంధు పేరిట పెట్టుబడి సాయం అందించింది. రెండు విడతలుగా ఎకరాకు రూ.10 వేలు బ్యాంక్ ఖాతాల్లో జమయ్యేవి. అయితే ఎన్నికలకు ముందు.. తాము అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని రైతు భరోసాగా మార్చి ఎకరానికి రూ. 15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక గత యాసంగి సీజన్‌లో ఎకరాకు రూ.5 వేల సాయం అందించింది. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో అందాల్సిన రైతు భరోసా నిధులు మాత్రం ఇంతవరకూ జమ చేయలేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటినా 'భరోసా' దక్కకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గతంలో ప్రతి జూన్, డిసెంబర్ నెలల్లో పెట్టుబడి సాయం అందేది. ఈ ఏడాది జూన్‌లో జమ కావాల్సిన పెట్టుబడి సాయం ఆగస్టు పూర్తి కావస్తున్నా అందలేదు.

నిధుల సమస్యే కారణమా ?

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసే ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలోనే రైతు భరోసా పంపిణీ ప్రక్రియ ఆలస్యమవుతోందనే చర్చ సాగుతోంది. రుణమాఫీకి భారీగా నిధులు అవసరం అవుతుండడంతో రైతు భరోసాకు నిధులు సమస్య ఏర్పడింది. అయితే రుణమాఫీ ప్రక్రియ కూడా గందరగోళంగా మారడంతో ఇటు రైతు భరోసా అందక, అటు రుణమాఫీ కాక చాలా మంది రైతులు పెట్టుబడి ఖర్చులకు నానా ఇబ్బందులు పడుతున్నారు.

సాగు భూములకే సాయం..

గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకంలో అనేక తప్పిదాలు ఉన్నాయని, అనర్హులకు కూడా పెట్టుబడి సాయం అందుతోందని ప్రస్తుత ప్రభుత్వం భావించింది. గుట్టలు, కొండలు సాగుకు యోగ్యం కాని భూములకూ రైతుబంధు అందినట్లు గుర్తించింది. అలా కాకుండా సాగు చేస్తున్న భూములకే పెట్టుబడి సాయం అందించే దిశగా చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో రైతుల అభిప్రాయాలు సేకరించింది. జిల్లా కేంద్రాల్లో మంత్రులు కూడా వర్క్‌షాప్‌లు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. రైతు భరోసా అమలుపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని సైతం ఏర్పాటు చేసింది. పెట్టుబడి సాయాన్ని పదెకరాలలోపు ఉన్న రైతులకు అందించాలా, ఐదెకరాలకు కుదించాలా అనే అంశంపైనా చర్చ జరిగింది. అయితే ఈ ప్రక్రియ మొత్తం పూర్తయినా ఇప్పటివరకు రైతు భరోసాపై విధివిధానాలు ప్రకటించలేదు. దీంతో రైతులకు అందించే పెట్టుబడి మరింత జాప్యం జరిగేలా కనిపిస్తోంది.


పెట్టుబడి సాయం అందించాలి

వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలైనా పెట్టుబడి సాయం అందలేదు. చాలా మంది రైతులకు రుణమాఫీ కూడా కాలేదు. పెట్టుబడులకు ప్రైవేటుగా అధిక వడ్డీలకు అప్పు చేయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలి. – యారం సుబ్బారెడ్డి, సంజీవరెడ్డిపాలెం


పెట్టుబడులకు కటకటే

రైతు భరోసా అందక పెట్టుబడులకు కటకటగా ఉంది. అదనులోనే రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే ఉపయోగంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే రైతు భరోసా అందించి ఆదుకోవాలి. – నిమ్మల రాములు, నాగినేనిప్రోలు

ముగిసిన ఉద్యోగుల క్రీడా పోటీలు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఉద్యోగుల జిల్లాస్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. ఉద్యోగులు క్రీడలతో ఒత్తిడి తగ్గించుకోవాలన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 930 మంది ఉద్యోగులు పాల్గొనగా డీవైఎస్‌ఓ పి.పరందామరెడ్డి అధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

విజేతలు వీరే..

800 మీటర్ల వాకింగ్‌లో 40 ఏళ్ల వారిలో కె.రవీందర్ (ప్రథమ), ఎండీ నయీముద్దీన్ (ద్వితీయ), భిక్షం (తృతీయ), మహిళల్లో ఎ.పార్వతి(ప్రథమ), కె. కృష్ణవేణి (ద్వితీయ), కె.నాగవేణి (తృతీయ), 40 ఏళ్ల లోపు వారిలో పి.మనోగ్న (ప్రథమ) బి.చందూలాల్ (ద్వితీయ), ఎం.మోహన్(తృతీయ), మహిళల విభాగంలో బి.సుజాత(ప్రథమ) కె. అనిత, (ద్వితీయ), సుభాన(తృతీయ) విజయం సాధించారు.

100 మీటర్ల పరుగు పందెంలో..

ఎం.రాము (ప్రథమ) పి.మనోగ్న (ద్వితీయ), బి.చందూలాల్(తృతీయ), హారిక(ప్రథమ) కె.అరుణ,(ద్వితీయ), ఎస్.కావ్య(తృతీయ) గెలుపొందారు. మ్యూజికల్ చైర్‌లో కె.నోమి, అరుణ, పావని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. లెమన్ స్పూన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.అరుణ, బి.శ్రావణి, ఎ.పార్వతి గెలుపొందారు.

చెస్ విభాగంలో..

పురుషుల జట్టులో వి. అవినాష్ చాంపియన్‌గా నిలిచారు. వై.శ్రీనివాసరెడ్డి, బి.శ్రావణ్‌కుమార్, డి. పుల్లయ్య, రమేష్, వెంకట్, దివాకర్ గెలుపొందారు. మహిళల విభాగంలో నవ్య చాంపియన్‌గా నిలవగా సీహెచ్ సరిత, టి.శ్రీలత, జి.ఝాన్సీ, సీహెచ్ సుభాషిణి విజేతలుగా నిలిచారు. టేబుల్ టెన్నిస్‌లో వి.సామ్యూల్ చాంపియన్‌గా నిలిచారు. కె. కృష్ణ సందీప్ గెలుపొందారు. మహిళల విభాగంలో ఎ.నాగకల్యాణి చాంపియన్‌గా నిలవగా కె.శ్రీవల్లి విజయం సాధించారు. బాడ్మింటన్ డబుల్స్ విభాగంలో డి. బోస్ కె, సురేష్‌కుమార్ చాంపియన్లుగా నిలిచారు. తర్వాత స్థానంలో ఈ. వెంకటేశ్వరావు, కె. రామకృష్ణ నిలిచారు. మహిళా విభాగంలో డాక్టర్ స్పందన, శృతి చాంపియన్‌లుగా నిలవగా తర్వాత స్థానంలో డాక్టర్ దమయంతి, వై.హారిక నిలిచారు. త్రోబాల్ మహిళల్లో సీహెచ్ జ్యోతి విన్నర్‌గా, ఆర్. వెంకటలక్ష్మి రన్నర్‌గా నిలిచారు. వాలీబాల్‌లో జి. వెంకటేశ్వర్లు టీం డీఎంఅండ్‌హెచ్‌ఓ టీం విన్నర్‌గా, బి. రమేష్ టీం, విద్యాశాఖ టీం రన్నర్‌గా నిలిచారు. **బాక్సింగ్‌లో** విద్యాశాఖ టీం విన్నర్‌గా, పశుసంవర్ధక శాఖ టీం రన్నర్‌గా నిలిచాయి.

మట్టి గణపతి ప్రతిమలనే పూజించండి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

మణుగూరు రూరల్ : మట్టి గణపతి ప్రతిమలనే పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. 'పర్యావరణాన్ని పరిరక్షించండి – భావితరాలను సంరక్షించండి' అనే నినాదంతో మణుగూరు మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మానవ మనుగడ సజావుగా సాగాలంటే ప్రకృతి, పర్యావరణ సమతుల్యత అవసరమని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చెరుకుపల్లి ఉపేందర్ రావు, భూక్యా సైదులు, ఇండ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జియో థర్మల్ ప్లాంట్ పరిశీలన

మణుగూరు మండలం పగిడేరులో ఏర్పాటు చేసిన జియో థర్మల్ ప్లాంట్‌ను కలెక్టర్ గురువారం సందర్శించారు. ప్లాంట్ పరిసరాలు, భూగర్భంలో నుంచి ఉబికి వస్తున్న వేడినీటిని పరిశీలించారు. ఆ తర్వాత సింగరేణి, ఓఎన్‌జీసీ, రెడ్కో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రాజెక్ట్ గురించి ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. వేడి నీటితో జియో థర్మల్ ప్లాంట్ ఏర్పాటై, ప్రత్యేకత సంతరించుకున్న ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని అధికారులకు సూచించారు. అనంతరం రామానుజవరంలో బీటీపీఎస్ రైల్వేలైన్ నిర్వాసితులతో మాట్లాడి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న, తహసీల్దార్ వి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీటీపీఎస్ నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పంచాయతీ ఎన్నికలపై వీసీ..

సూపర్‌బజార్(కొత్తగూడెం): పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.పార్థసారధి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నూతన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని సూచించారు. జిల్లా నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు డి వేణుగోపాల్, విద్యాచందన, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ రావు, డీపీఓ చంద్రమౌళి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డీఎల్‌పీ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర శ్రమతో ఏదైనా సాధ్యమే..

కొత్తగూడెంఅర్బన్: నిరంతరం శ్రమిస్తే ఏదైనా సాధించగలమని కలెక్టర్ పాటిల్ అన్నారు. స్థానిక యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో గురువారం జరిగిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రాజు, కన్వీనర్ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేయాలి



భూమిపూజ చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణ తదితరులు

ఎంపీ రఘురాంరెడ్డి

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి అశ్వారావుపేటలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్య, ఆటలు, ఆరోగ్యంపై ఎమ్మెల్యే జారే చొరవ తీసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో ఉత్సాహంగా ఉన్న వారు చదువులోనూ రాణిస్తారని చెప్పారు. అత్యాధునిక టెక్నాలజీతో సింథటిక్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, వీలైనన్ని క్రీడా కోర్టులు ఏర్పాటు చేయాలని డీవైఎస్‌ఓ పరంధామరెడ్డికి సూచించారు. ఇందుకు కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ ఏప్రిల్‌లో జాతీయ, రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లు జరుగుతాయని.. అప్పటివరకు స్టేడియం పనులు పూర్తి కావాలని సూచించారు. అశ్వారావుపేటలో స్పోర్ట్స్ మీట్ నిర్వహణకు కృషి చేస్తామన్నారు. అనంతరం గురుకుల విద్యార్థులతో ఎంపీ, ఎమ్మెల్యే ముచ్చటించారు. కాగా, అశ్వారావుపేటలో ఆయిల్‌పాం రిఫైనరీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య ఎంపీకి వినతిపత్రం సమర్పించారు. అశ్వారావుపేట, అప్పారావుపేటలో ఆయిల్‌పాం కర్మాగారాలున్నాయని, కొత్తగా వేంసూరు మండలం కల్లూరుగూడెంలో కర్మాగారం తయారవుతోందని.. తద్వారా ప్రభుత్వ కర్మాగారాల్లో తయారయ్యే ముడి ఆయిల్‌ను ఇక్కడే రిఫైన్ చేసి ప్యాకింగ్ చేస్తే రైతులకు అధిక లాభం వస్తుందని వివరించారు. ఆ తర్వాత తమను పర్మనెంట్ చేయాలని కోరుతూ అశ్వారావుపేట పంచాయతీ కార్మికులు ఎంపీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, దమ్మపేట ఎంఈఓ కీసర లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, నండ్రు రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోంది..

చండ్రుగొండ: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని ఎంపీ రఘురాంరెడ్డి అన్నారు. మండలంలోని మద్దుకూరు, చండ్రుగొండ, దామరచర్ల గ్రామాల్లో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అర్హత గల ప్రతీ రైతుకు రుణమాఫీ ఇస్తామని తెలిపారు. సీతాయిగూడెంలోని వెంగళరాయ సాగర్ మరమ్మతు పనులు త్వరలోనే చేపడతామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ అశోక్, ఎంఈఓ సత్యనారాయణ, నాయకులు బోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, నల్లమోతు రమణ, గోవింద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బడుగు శంకర్, సురేష్, ఫజల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిన్నెరసాని గేటు ఎత్తివేత

- 5 వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 100 క్యూసెక్కుల వరద నీరు రావడంతో గురువారం నీటిమట్టం 405.60 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తి 5 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు. నది దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో మహిళకు గాయాలు

పాల్వంచ: విద్యుత్ వైర్లకు ఐరన్ రాడ్ తగలడంతో ఓ మహిళా కూలీకి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని బాపూజీనగర్‌లో గల ఓ భవనం పైఅంతస్తులో గురువారం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అక్కడ పనికి వెళ్లిన కుంటినాగులగూడెంకు చెందిన ప్రియా ఐరన్ రాడ్‌ను పక్కకు వేస్తున్న క్రమంలో రాడ్ బిల్డింగ్ పక్కనే విద్యుత్ వైర్లకు తగలడంతో మంటలు వచ్చి విద్యుత్ షాక్‌కు గురైంది. వెంటనే తోటి కూలీలు ఆమెను రక్షించి కొత్తగూడెం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ట్రాలీ ఆటో ఢీకొని యువకుడికి గాయాలు

పాల్వంచ: మోటార్ సైకిల్‌ను ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కిన్నెరసాని గ్రామానికి చెందిన షేక్ మైబూబ్ చిన్న కుమారుడు అక్బర్ గురువారం తన మోటార్‌సైకిల్‌పై అల్లూరి సెంటర్ నుంచి నటరాజ్ సెంటర్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో యూటర్న్ వద్ద అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటో వచ్చి ఢీకొట్టింది. దీంతో అక్బర్ తలకు గాయాలు కావడంతో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మంకు తరలించినట్లు సమాచారం.

ఆటో, బైక్ బోల్తా..

అశ్వాపురం: మణుగూరు నుంచి అశ్వాపురం వైపు వస్తున్న ఆటో, బైక్ మండల పరిధిలోని గోపాలపురం వద్ద అదుపు తప్పి రహదారి వెంబడి కిందికి దూసుకుపోయి బోల్తా పడ్డాయి. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. సంఘటనా స్థలాన్ని సీఐ అశోక్‌రెడ్డి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేట తండాకు చెందిన ఓ వ్యక్తి పంట పొలంలో నాటు సారా తయారీ స్థావరంపై ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడి చేసి 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే.. తండాకు చెందిన లకావత్ శంకర్ తన పొలంలో నాటుసారా తయారీ చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ, తన సిబ్బంది కలిసి ఘటనా స్థలానికి చేరుకుని దాడి చేశారు. ఈ దాడిలో 100 లీటర్ల బెల్లం పానకం(బెల్లం ఊట)తో పాటు బట్టీని ధ్వంసం చేశారు. కాగా, సంబంధిత వ్యక్తి శంకర్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుళ్లు ముత్తయ్య, సాయి పల్లవి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్..

- ఆచూకీ కోసం గాలింపు

పాల్వంచ: మైనర్ బాలికను ఓ వ్యక్తి కిడ్నాప్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదివే బాలికను మాయమాటలతో ఇందిరానగర్ కాలనీలో అద్దెకు ఉంటున్న ఓ పెయింటర్ కిడ్నాప్ చేశాడు. గత మూడు రోజుల క్రితం ఈ ఘటన చోటు చేసుకోగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ సుమన్‌ను వివరణ కోరగా.. గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

బూర్గంపాడు: మండలంలోని నాగినేనిప్రోలు–రెడ్డిపాలెం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని రాజేష్ హెచ్చరించారు.

మూడు పశువులు స్వాధీనం

భద్రాచలంఅర్బన్: అక్రమంగా ట్రాలీ ఆటోలో తరలిస్తున్న మూడు పశువులను టౌన్ పోలీసులు గురువారం ఉదయం పట్టుకున్నారు. చర్ల మండలం ముసలేరు గ్రామం నుంచి బూర్గంపాడు మండలం లక్ష్మీపురానికి తరలిస్తున్న క్రమంలో గురువారం బ్రిడ్జి వద్ద ఉన్న చెక్‌పోస్ట్ వద్ద వీటిని భద్రాచలం టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు పట్టుకున్నారు. అనంతరం పశువులను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించిన్నట్లు టౌన్ ఎస్‌ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

‘అప్‌గ్రేడ్’ కాక.. సౌకర్యాలు లేక!

ప్రతిపాదనలకే పరిమితమైన పాల్వంచ 100 పడకల ఆస్పత్రి

- సీహెచ్‌సీకి పోటెత్తుతున్న పేషెంట్లు
- రోజుకు 600 నుంచి 700 ఓపీ నమోదవుతున్న వైనం
- అసౌకర్యాలతో అరకొర వైద్య సేవలు
- అవస్థలు పడుతున్న వైద్య సిబ్బంది



ఓపీ కోసం బారులుదీరిన బాధితులు

పాల్వంచ: సీజనల్ వ్యాధులతో పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కు వచ్చే బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండడంతో ఆస్పత్రి పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. పక్కనే ఉన్న కొత్తగూడెం జిల్లా ఆస్పత్రి దీటుగా ఇక్కడకు ఓపీ, ఐపీ పేషెంట్లు పెరుగుతున్నారు. ఈ సీజన్‌లో రోజుకు సుమారు 600 నుంచి 700 మంది బాధితులు వైద్య సేవల కోసం ఆస్పత్రికి వస్తుండడం గమనార్హం. కానీ ఇక్కడ సౌకర్యాలు సరిపడా లేకపోవడంతో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందించాల్సి వస్తోంది. వైరల్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలతో ఆస్పత్రికి వస్తుండడంతో వారందరికీ ప్రస్తుతం ఉన్న 50 పడకలు సరిపోక, అరకొర వైద్య సిబ్బందితో వైద్య పరీక్షలు సమయానికి అందించలేక నానా అవస్థలు పడుతున్నారు. 100 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దాలనే ప్రతిపాదనలు సైతం ముందుకు పడడం లేదు. జ్వరాలతో పాటు నొప్పులు కూడా ఎక్కువగా ఉండడంతో తగ్గడానికి సమయం పడుతుంది.

మెరుగైన వైద్య సేవలు అందుతాయని..

సీహెచ్‌సీ ఆవరణంతో పాటు వైద్య సేవలు కూడా మెరుగ్గా ఉన్నాయనే ఉద్దేశంతో చుట్టుపక్కల మండలాల నుంచి బాధితులు అధిక సంఖ్యలో ఇక్కడికే వస్తున్నారు. పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించుకున్న వారు, గర్భిణులు, ఇతర శస్త్ర చికిత్సల కోసం వస్తున్న వారి సంఖ్య పాల్వంచ పట్టణ, మండల ప్రాంతాలతో పాటు ములకలపల్లి, బూర్గంపాడు నుంచి క్రమేణ పెరుగుతూ వస్తోంది. ఈనేపథ్యాన శస్త్రచికిత్సలు, డెలివరీలు నెలకు సుమారు 100 నుంచి 120 వరకు చేస్తున్నారు. దీనికి తోడు సీజనల్ వ్యాధులతో వస్తున్న వారితో ఆస్పత్రిలోని 50 పడకలు సరిపోవడం లేదు. ఒక్కోసారి ఒకే బెడ్‌పై ఇద్దరి చొప్పున ఉంచాల్సిన వస్తోంది. ఇటువంటి సమయాన కూడా కొందరు బాధితులు వైద్య పరీక్షల కోసం వచ్చి అన్ని పరీక్షలు చేయాలని వైద్యులను డిమాండ్ చేస్తున్నారు. పరీక్షలు అవసరం ఉన్నా లేకున్నా వారి పరిస్థితిని బట్టి చేయాల్సి ఉండగా పరీక్షలు చేయాల్సిందేనని ఒత్తిడి తీసుకొస్తున్న సందర్భాలు అనేకం.

అరకొర వైద్యులతో ఇబ్బంది..

50 పడకల ఆస్పత్రి కావడంతో అందుకు తగిన విధంగానే వైద్యులు ఉన్నారు. కానీ బాధితుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో సౌకర్యాలు, వైద్యులు, వైద్య సిబ్బంది మాత్రం పెరగడం లేదు. ఉన్న వైద్యులు కూడా కొందరు పలు కారణాల వల్ల విధులకు సక్రమంగా రావడం లేదు. ఇద్దరు ఫిజీయన్లకు ఒక్కరే ఉన్నారు. మొత్తం 22 మంది వైద్యులకు గాను పీడియాట్రిక్ 3, గైనిక్ 2, అనస్తీషియా 1, రేడియాలజీ 1, ఆర్థోపెడిక్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారిపై అదనపు భారం పడుతోంది. అప్‌గ్రేడ్ అయితే సుమారు 50 మంది వైద్యుల నియామకం అయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఇక్కడ పనిచేసే వైద్యులు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు నిత్యకృత్యంగా మారాయి. సమయానికి డ్యూటీలో ఉండడం లేదని వాపోతున్నారు.

పరిమితికి మించి సేవలు అందిస్తున్నాం..



జిల్లా ఆస్పత్రికి దీటుగా ఇక్కడ వైద్య సేవలు అందిస్తున్నాం. రోజుకు 600 నుండి 700 మందికి చూస్తున్నాం. వ్యాధుల సీజన్ కావడంతో ఎక్కువ శాతం అన్ని రకాల పరీక్షలు చేయించుకునేందుకు అధికంగా వస్తున్నారు. డెలివరీలు, ఓపీ, ఐపీలు కూడా ఎక్కువగా వస్తుండడంతో 50 పడకలు సరిపోవడం లేదు. వైద్యుల కొరతతో ఇబ్బందిగా ఉంది.

– పి.రాంప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రతిపాదనలు పంపించాం..



పాల్వంచ సీహెచ్‌సీలోని అసౌకర్యాలపై గతంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు పలుమార్లు ప్రతిపాదనలు పంపాం. అయితే కొత్తగూడెం ఆస్పత్రి 330 పడకలు ఉండడంతో అప్‌గ్రేడ్ చేయడం లేదని తెలుస్తోంది. కానీ, పాల్వంచ కూడా మున్సిపాలిటీ పరిధి కాబట్టి ఇక్కడకు వచ్చే బాధితుల సంఖ్య అధికమే. దీని దృష్ట్యా మళ్లీ నివేదిక అందిస్తాం.

– డాక్టర్ రవిబాబు, డీసీహెచ్ఎస్

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జిల్లా ఉపాధి కల్పనా అధికారి శ్రీరామ్



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న శ్రీరామ్

చుంచుపల్లి: నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాల ద్వారా వచ్చే ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్ అన్నారు. గురువారం చుంచుపల్లి మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో జాబ్ మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఏజెన్సీ జిల్లాలో నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు. ఉన్న గ్రామం, జిల్లాలోనే పనిచేయాలనే ఆలోచనను విరమించుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జాబ్ మేళాకు 65 మంది హాజరు కాగా వారి ప్రతిభ పాటవాల ఆధారంగా పలు కంపెనీలకు ఇంటర్వ్యూలు నిర్వహించి 32 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది, వివిధ కంపెనీలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర పీహెచ్‌సీలో ఆశా వర్కర్లను దుర్భాషలాడుతూ వేధిస్తున్న డాక్టర్, హెచ్‌ఈఓ, ఏఎన్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముత్యాలంపేట ఆశా వర్కర్‌పై ఒక ఏఎన్ఎం కుర్చీ తీసుకుని దాడికి యత్నించిందని, అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నా.. ఆశావర్కర్‌ను పిలిపించి మరీ ‘నీ సంగతి చూస్తాం, నీకు జీతం రాకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆశా వర్కర్లను స్కావెంజర్లుగా చూడడం, స్వీపర్లుగా మార్చడం సరికాదన్నారు. గర్భిణులు ప్రసవానికి పుట్టింటికి వెళ్లినా ఆశా వర్కర్లను బాధ్యులుగా చేసి వేధిస్తున్నారన్నారు. వీరిపై చర్యలు తీసుకోకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో శ్రీలత అనే ఆశా వర్కర్ స్పృహ తప్పి పడిపోగా కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ధర్నా వద్దకు డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఏఓ డాక్టర్ బాలాజీ, బంజర పీహెచ్‌సీ డీఓ డాక్టర్ స్పందన వచ్చి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బ్రహ్మాచారి, జిల్లా నాయకుడు భూక్యా రమేష్, ఆషా వర్కర్ల యూనియన్ నాయకురాలు బుచ్చమ్మ, తారామణి, కృష్ణవేణి, భువనేశ్వరి, వసంత, శ్రీలత, సాలి, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని వైద్యాధికారులు సమన్వయంతో పని చేసి, జ్వరపీడితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కర్‌నాయక్ అన్నారు. గురువారం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని వైద్య అధికారులతో వైద్య శాఖ మంత్రి దామోదర్ నర్సింహ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో డెంగీ, మలేరియా అంటు ప్రజలను ఇబ్బంది పెట్టి ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంతర తనిఖీలు నిర్వహించాలని, జిల్లాలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాలు నూటికి నూరు శాతం పూర్తి చేసేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. విషజ్వరాల అనుమానితుల రక్త, మూత్ర నమూనాలను సేకరించి, అవసరమైన పరీక్షలు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత, బాలాజీనాయక్, మధువన్, కల్యాణ్‌పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటాలు



జర్నలిస్టుల సమస్యలను వివరిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానించింది. కొత్తగూడెంలో గురువారం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బీవీ రమణారెడ్డి, జనుమాల రమేష్‌ల ఆధ్వర్యాన జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడారు. ఈమేరకు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ, రైల్వే పాసుల పునరుద్ధరణ, వైద్యంలో రాయితీ తదితర సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. నూతనంగా ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచిరాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన కె.రాంనారాయణ, గతంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి నూతన సంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన విరహత్ అలీని సముచిత రీతిలో సెప్టెంబర్ రెండో వారంలో జిల్లా కమిటీ అభినందించి సత్కరించాలని నిర్ణయించారు. జిల్లా సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరాలని తీర్మానించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు 12 మందితో కూడిన స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మొబగాపు అనంద్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శిర్గ సభ్యులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

- డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంటౌన్: వినాయక మండపాలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, డీజేలకు అనుమతి లేదని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వన్‌టౌన్, త్రీటౌన్ పరిధిలోని సౌండ్ సిస్టం నిర్వాహకులతో సీఐలు కరుణాకర్, శివప్రసాద్‌ల ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మత సామరస్యాన్ని పాటిస్తూ వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. అందుకు ప్రతీ వినాయక మండపానికి కమిటీ వేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండాప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. డీజే సిస్టం వినియోగిస్తే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై విజయలతో పాటు సౌండ్ సిస్టం నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్..

- స్తంభం విరిగి ట్రాక్టర్‌పై పడిన తీగలు
- చాకచక్యంగా బయటపడిన డ్రైవర్, కార్మికుడు
- దగ్గరలోని కూలీలకూ తప్పిన పెను ప్రమాదం



విరిగిన విద్యుత్ స్తంభం

దుమ్ముగూడెం: బ్లీచింగ్ చల్లుకుంటూ వెళ్తున్న ఓ పంచాయతీ ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి తీగలు ట్రాక్టర్ ట్రక్కుపై పడేలోగా డ్రైవర్, ఓ కార్మికుడు చాకచక్యంగా తప్పించుకోవడం, ఘటన ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అచ్చితాపురం గ్రామంలో గురువారం పంచాయతీ ట్రాక్టర్‌లో బ్లీచింగ్ చల్లుకుంటూ డంపింగ్ షెడ్ వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ట్రక్కు ఢీకొట్టడంతో స్తంభం విరిగి కిందపడగా విద్యుత్ వైర్లు ట్రాక్టర్‌పై పడ్డాయి. ఈ సమయంలో ట్రాక్టర్‌లో ఉన్న పంచాయతీ కార్మికుడు, డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. అంతేకాక కొంచెం దూరంలోనే కూలీలు నాటు వేస్తున్న పొలంలోని విద్యుత్ స్తంభానికి ఏమీ కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు తెగి పొలంలో పడినట్లయితే ఊహకందని ప్రమాదం జరిగేదంటూ గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటన స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు సందర్శించారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు నమోదు

కొత్తగూడెంరూరల్: ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద 54 రకాల మందులు ఉన్నట్లు ఉమ్మడి జిల్లాల ఔషధ అధికారులు గుర్తించి కేసు నమోదు చేసిన సంఘటన గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఒక ఆర్‌ఎంపీ అనుమతులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారని ఉమ్మడి జిల్లా ఔషధ అధికారులకు తెలిసింది. దీంతో ఖమ్మం జిల్లా ఔషధ అధికారి కె.దేవందర్‌రెడ్డి, ఖమ్మం జిల్లా ఔషధ నియంత్రణ సహాయ సంచాలకురాలు రాజ్యలక్ష్మి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఔషధ తనిఖీ అధికారి సీహెచ్.సంపత్‌కుమార్‌లు ఆర్‌ఎంపీ నిర్వహించే ఆస్పత్రికి వద్దకు వెళ్లి తనిఖీ చేయగా 54 రకాల మందులు బయటపడ్డాయి. దీంతో ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేసి కోర్టులకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా మందులు విక్రయించరాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం 1940 కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అంతర్రాష్ట్ర టీటీ పోటీల్లో ప్రతిభ

అశ్వాపురం: తమిళనాడులోని కూడంకళంలో జరిగిన అంతర్రాష్ట్ర అణుశక్తి కేంద్ర పాఠశాలల టేబుల్ టెన్నిస్ పోటీల్లో మండల కేంద్రంలోని అణుశక్తి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ –14 విభాగంలో మీరవ్ ఠాకూర్, షణ్ముక్, సోమశేఖర్, షేక్ సుఫియాన్ సింగిల్స్, డబుల్స్‌లో తృతీయ స్థానం, టీం చాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం సాధించారు.

రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలి

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు ఆధ్వర్యంలో గురువారం స్టేషన్ ఏరియా మేనేజర్ రామ్‌భజన్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం చుట్టుపక్కల పారిశ్రామిక ప్రాంతాలు ఉన్నాయని, భద్రాద్రి రామాలయానికి ఎంతోమంది భక్తులు వస్తుంటారని పేర్కొన్నారు. జిల్లా నుంచి షిరిడీ, తిరుపతికి ఎంతో మంది వెళ్తుంటారని, వీరందరికీ అనుకూలంగా ఉండేలా రైళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమణగుప్త, దివ్య, జయరాజ్ కృష్ణ, పవన్ కళ్యాణ్, చైతన్య, సుమన్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నలుగురికి జైలుశిక్ష..

కొత్తగూడెంటౌన్: దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో నలుగురికి పది నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ గురువారం కొత్తగూడెం జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.శివనాయక్ తీర్పు చెప్పారు. వివరాలిలా.. పాల్వంచ టౌన్‌కు చెందిన కేటీపీఎస్ ఉద్యోగి అగ్రగడ్డ శ్రీనివాసరావు 2018లో హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో వెళ్లి తిరిగి మూడు రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూడగా.. బీరువాలోని 10.5 గ్రాముల బంగారు బ్రాస్లెట్, 5 గ్రాముల చెవి దిద్దులు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి పాల్వంచ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ కేసు నమోదు చేశారు. అప్పటి కొత్తగూడెం టూటౌన్ సీఐ టి.గోపి తన కేసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో పాల్వంచ మొండికట్టకు చెందిన పాన్నాల శివశంకర్, బూర్గంపాడు మొరంపల్లి బంజర్‌కు చెందిన జక్కుల వెంకన్న, పాల్వంచ ఇందిరాకాలనీకి చెందిన బానోత్ ప్రశాంత్, భద్రాచలం ఏఎస్‌ఆర్ కాలనీకి చెందిన వాడేపల్లి రమేష్‌లపై జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. వీరి నుంచి పాల్వంచ టౌన్ అగ్ర శ్రీనివాసరావు ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో నలుగురి వద్ద నుంచి బంగారు నగలు రికవరీ చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో ఐదుగురు సాక్షులను విచారించిన జడ్జి నలుగురిపై దొంగతనం నేరం రుజువు కావడంతో పది నెలల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీఓ ఎస్.లావణ్య వాదించగా.. లైజన్ ఆఫీసర్ ఎస్‌కె.ఘని, పాల్వంచ పీసీ జి.భాస్కర్‌లు సహకరించారు.

వరకట్న వేధింపుల కేసులో ఒకరికి..

కొత్తగూడెంటౌన్: వరకట్నం తీసుకురావాలని భార్యను వేధించిన కేసులో వరంగల్‌కు చెందిన పబ్బినేని శ్రీనివాసరెడ్డికి ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం కొత్తగూడెం రెండో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. వరంగల్ పెరికవాడకు చెందిన పబ్బినేని శ్రీనివాసరెడ్డికి కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన పుణ్యవతితో 2013లో వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.1.50 లక్షల కట్నం, రెండు బంగారు ఉంగరాలు, రూ.లక్ష విలువైన గృహోపకరణాలు ఇచ్చారు. ఆతర్వాత అదనపు కట్నం తీసుకురావాలని పుణ్యవతిని ఆమె అత్త, భర్త వేధిస్తుండడంతో 2015లో భర్త శ్రీనివాసరెడ్డి, అత్త విజయపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసును జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.సాయిశ్రీ విచారించగా..శ్రీనివాసరెడ్డిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో నెల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున బడిపాటి విశ్వశాంతి వాదించగా ఎస్.కే.ఘని, బోడ శోభన్‌బాబు సహకరించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువతి మృతి

బూర్గంపాడు: బావి వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఓ యువతి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన సారపాకలోని గాంధీనగర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాక గాంధీనగర్‌కు చెందిన కొత్తూరు యాదగిరి కుమార్తె ఆదిలక్ష్మి(22) గురువారం తమ ఇంటి సమీపంలోని బావి వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ఆమెకు చాలాకాలం నుంచి మూర్ఛవ్యాధి ఉంది. బట్టలు ఉతుకుతున్న సమయంలో మూర్ఛ వచ్చి ఆమె బావిలో పడగా స్థానికుల సాయంతో బయటకు తీసి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగిన ఫెర్టిలైజర్ డీలర్..

పాల్వంచ: పురుగుల మందు తాగిన ఫెర్టిలైజర్ షాపు డీలర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన అలస్యం ప్రశాంత్ గత కొంతకాలంగా పాల్వంచ బస్టాండ్ సమీపంలో ఓ ఫెర్టిలైజర్ షాపును నడిపిస్తున్నాడు. కాగా, బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా.. గుర్తించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రైవేట్ ఆస్పత్రికి, ఆపై ఖమ్మంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య

కరకగూడెం: పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీలాద్రిపేట వలస ఆదివాసీ గ్రామానికి చెందిన దేవి(30) తన భర్త కోసయ్యకు మధ్య గురువారం గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె క్షణికావేశంలో పురుగుల మందు తాగగా.. గమనించిన కుటుంబసభ్యులు 108లో కరకగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

ఆలయాల్లో దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

చండ్రుగొండ: కొన్నేళ్లుగా ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కొత్తగూడెం కోర్టుకు రిమాండ్ చేసినట్లు జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పెనగడప పంచాయతీ మర్రిగూడెంకు చెందిన మడిమి భద్రయ్య చండ్రుగొండ మండలం రేపల్లెవాడ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం, అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెంట్లంలోని ఆలయం, సునాతనగర్ మండలంలోని మరో ఆలయం, కొత్తగూడెం టూటౌన్‌లో మరికొన్ని దొంగతనాలకు పాల్పడినట్లు సీఐ చెప్పారు. ఈ నెల 28న చండ్రుగొండ ప్రధాన సెంటర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో ఎస్సై గంజి స్వప్న ఆధ్వర్యాన కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, అశోక్ ఆయనను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో దొంగతనాల గుట్టు రట్టు అయిందన్నారు.

పొలాల్లో సోలార్ ప్లాంట్లు

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం-కుసుమ్) పథకం కింద రైతులు/రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతిచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకంలో చేరేందుకు ఆసక్తి ప్రదర్శించలేదు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజ్ఞప్తి చేయడంతో కేంద్రం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అన్ని రాష్ట్రాలకు కలిపి ఇప్పటివరకు 8,112 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు కేంద్రం అనుమతి ఇవ్వగా, అందులో అత్యధికంగా 4 వేల మెగావాట్ల ప్లాంట్లు రాష్ట్రా నికి సంబంధించినవే కావడం గమనార్హం. రైతులు వ్యక్తిగ తంగా లేదా ఇతరులతో కలిసి తమ పొలాల్లో 0.5 మెగా వాట్లు నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం కలిగిన చిన్న సోలా ర్ పవర్ ప్లాంట్లను పెట్టుకోవడానికి అవకాశం కల్పిస్తారు. రెన్యువబుల్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (ఆర్పీఓ) నిబంధనల ప్రకారం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ఏటా తప్పనిసరిగా కొంత శాతం పునరుత్పాదక విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్లాంట్‌ల ద్వా రా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కూడా ఆర్పీఓ నిబంధనల కింద డిస్కంలు తప్పనిసరిగా రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చొప్పున రైతులకు డిస్కంలు చెల్లించనున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసే ప్రతి యూనిట్ విద్యుత్‌కు 0.40 పైసలు చొప్పున ఐదేళ్ల పాటు డిస్కంలకు కేంద్ర పునరు త్పాదక ఇంధన శాఖ ప్రోత్సాహకంగా అందించనుంది.

- రైతులు 4 వేల మెగావాట్ల ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి
- పీఎం-కుసుమ్ పథకం కింద కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేయనున్న డిస్కంలు
- యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చెల్లించనున్న విద్యుత్ సంస్థలు



పెట్టుబడిలో 30% రైతుల వాటా

రైతులు స్వయంగా తమ స్థలాల్లో ప్లాంట్ పెట్టుకోవచ్చు. లేకుంటే సహకార సంఘాలు/పంచాయతీలు/రైతుల గ్రూపులు/నీటి వినియోగ సంఘాలతో కలిసి ఏర్పాటు చేయవచ్చు. ఆర్థిక స్తోమత లేకుంటే డెవలపర్లకు తమ స్థలాలను లీజుకు ఇచ్చి ప్లాంట్ పెట్టించవచ్చు. మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా ఏటా సగటున 16 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుండగా, రైతులు/డెవలపర్లకు రూ.50.08 లక్షల ఆదాయం రానుంది. అయితే సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు వ్యయం మెగావాట్‌కు రూ.4 కోట్ల నుంచి రూ.4.5 కోట్ల వరకు కానుంది. ఇందులో రైతులు 30 శాతం పెట్టుబడి పెడితే మిగిలిన 70 శాతం మూలధనాన్ని బ్యాంకులు రుణంగా ఇచ్చే అవకాశం ఉంటుంది. 10–12 ఏళ్లలో రైతుల పెట్టుబడి మొత్తం తిరిగి వచ్చే అవకాశం ఉందని తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) జనరల్ మేనేజర్ జీఎస్‌వీ ప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు.

త్వరలో ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం..

డిస్కంలు తమ 33/11 కేవీ, 66/11 కేవీ, 110/11 కేవీ సబ్ స్టేషన్ల వారీగా వాటి పరిధిలో ఎంత సామర్థ్యం మేరకు సోలార్ పవర్ ప్లాంట్లు పెట్టేందుకు అవకాశం ఉందో గుర్తించి తమ వెబ్‌సైట్‌లో ప్రకటించాల్సి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఈ ప్రక్రియ పూర్తైంది. త్వరలో రైతుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానిస్తూ డిస్కంలు ప్రకటన జారీ చేయనున్నాయి. ఆసక్తి గల రైతులు/డెవలపర్లు మెగావాట్‌కు రూ.,5000కి మించకుండా ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రైతులు/డెవలపర్లు కుదుర్చుకునే విద్యుత్ కొనుగోలు ఒప్పందం ఆధారంగా రైతులు/డెవలపర్లకు బ్యాంకులు రుణం ఇవ్వనున్నాయి.



కొలనుపాకలోని సోమేశ్వరాలయంలో శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోంది

- ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామస్తుల ఐకమత్యం బాగుంది
- జనగామ, భువనగిరి జిల్లాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన
- అవార్డు గ్రహీతలను కలిసిన గవర్నర్

జనగామ, సాక్షి యాదాద్రి: తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. ఇక్కడకు గవర్నర్‌గా వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా ఓ మారుమూల గ్రామానికి రావడం సంతోషాన్ని కలిగించిందని అన్నారు. గురువారం జనగామ, భువనగిరి జిల్లాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటించారు. రెండు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ రంగాల ప్రముఖులు, కవులు, కళాకారులు, రచయితలతో భేటీ అయ్యారు. జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న తర్వాత ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజలు చాలామంచి వ్యక్తులని, అందులో ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామస్తుల ఐకమత్యం సంతోషం కలిగించిందన్నారు. ఊరిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం కొద్దిరోజుల్లో టూరిస్టు సెంటర్‌గా మారబోతుందని చెప్పారు. అంతకుముందు జనగామ జియోగ్రాఫికల్ వివరాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక, సాహిత్యంలో యాదాద్రి టాప్..

సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాల్లో యాదాద్రి భువనగిరి జిల్లా ఎంతో ప్రసిద్ధి చెందిందని గవర్నర్ అన్నారు. వివిధ రంగాలలో అవార్డు గ్రహీతలను ఆయన అభినందించారు. స్వాతంత్ర్య సమరయోధులు మన్నె గోపాలరెడ్డి, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లానాయక్‌లను గవర్నర్ శాలువాలతో సత్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశం, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోమ్లా నాయక్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీతలు డాక్టర్ ఎన్.గోపి, నిఖిలేశ్వర్, కాళోజీ పురస్కార గ్రహీత శ్రీరామోజు హరగోపాల్, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, రాష్ట్ర ప్రభుత్వ యువ పురస్కార గ్రహీత తిరునగరి శ్రీనివాస్, పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి, నంది అవార్డు గ్రహీత ఎం.డి.అబ్దుల్, శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ షేక్ అబ్దుల్ ఘని, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కార గ్రహీత లింగంపల్లి రామచంద్రం తదితరులతో గవర్నర్ సమావేశమయ్యారు. అనంతరం వారితో కలిసి రాత్రి భోజనం చేశారు.

ఆలయాల సందర్శన: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు మండలం కొలనుపాక జైన దేవాలయాన్ని సందర్శించారు. అదేవిధంగా శ్రీ చండికాంబ సహిత సోమేశ్వర దేవాలయాలను సందర్శించిన గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి దేవాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం హోదాలో ఉండి సుప్రీం తీర్పుపై వ్యాఖ్యలా!

▶ మొదటి పేజీ తరువాయి

జరగనివ్వండి' అంటూ జస్టిస్ గవాయి ఘాటుగా వ్యాఖ్యానించారు.

పదే పదే అలాంటి వ్యాఖ్యలా?

'ఆ తరహా వ్యాఖ్యలు..మళ్లీ గురువారం ఉదయం కూడా! బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన తొలి వంద రోజుల్లోనే ఈ తరహా స్టేట్‌మెంట్లు ఇవ్వడాన్ని ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. కోర్టుపై ఆక్షేపణలు చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి చేసే బాధ్యతాయుతమైన ప్రకటనేనా ఇది? న్యాయవ్యవస్థకు ఆమడ దూరంలో ఉండడమే కార్యనిర్వాహకుల ప్రాథమిక విధి. విమర్శించండి.. కానీ ఆక్షేపణలు వద్దు..' అని జస్టిస్ విశ్వనాథన్ స్పష్టం చేశారు.

అలాగైతే న్యాయాధికారులపై విశ్వాసం లేనట్లే అవుతుంది

'ఓటుకు నోటు కేసు విచారణ బదిలీ చేయాలన్న పిటిషన్లు విచారణకు స్వీకరిస్తే న్యాయాధి కారులపై కోర్టుకు విశ్వాసం లేనట్లే అవుతుంది. ఎన్నికల సమయంలో ఇలాంటి పిటిషన్లు దాఖలు చేస్తారు. చట్టసభల్లో జోక్యం చేసుకోబోమని చెబుతుంటాం. వారికీ ఇది వర్తిస్తుంది' అని జస్టిస్ గవాయి పేర్కొన్నారు.

దర్యాప్తు పారదర్శకంగా జరిగే అవకాశం లేదు: పిటిషనర్ల తరపు న్యాయవాది

వ్యాఖ్యల సవరణకు ప్రయత్నిస్తామని తెలంగాణ ప్రభుత్వం తరపు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయ వాది ముకుల్ రోహత్గీ తెలిపారు. అయితే జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిపోయిందని, అటువంటి వ్యాఖ్యలు న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకురావడంతోపాటు దిగువ కోర్టులకూ వ్యాపించే అవకాశం ఉందని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది సి.సుందరం పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సీఎం కావడంతో పాటు ఏసీబీని కూడా తన అధికార పరిధిలో ఉంచుకున్నారని, దర్యాప్తు పారదర్శకంగా జరిగే అవకాశం ఉండదని అన్నారు. దర్యాప్తు అధికారులు కూడా మారారని చెప్పారు. గతంలో దాఖలు చేసిన కౌంటరుకు సంబంధించి సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. పోలీసులపై కూడా రేవంత్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అని, ఏ వ్యక్తీ తన సొంత విషయంలో న్యాయమూర్తి కాకూడదనే సహజ న్యాయసూత్రం గుర్తుచేశారు.

న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉంచాలి

ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మా సనం.. స్వతంత్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తే దర్యాప్తుపై విశ్వాసం పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. గతంలో దర్యాప్తుపై స్టే ఇచ్చిన అంశం, సీబీఐకి బదిలీ తదితర అంశాలపై ఆరా తీసింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకంపై తెలంగాణకు చెందిన సహచరుల ను సంప్రదిస్తామని తెలిపింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తామని, అయితే ప్రస్తుత పిటిషన్‌ను కొట్టివేస్తామని పేర్కొంది. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంచాలని, అందరికీ విశ్వాసం కలిగేలా నియామకం చేపడతామని జస్టిస్ గవా యి చెప్పారు. ప్రస్తుత పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేంద్రరావుతో పాటు మరో న్యాయవాది ఉమామహేశ్వరరావు ఉత్తమమని భావిస్తున్నామన్నారు. అయితే తమకు పోలీసు అధికారుల విష యంలో ఆందోళన ఉందని పిటిషనర్ల తరపు మరో సీనియర్ న్యాయవాది శేషా ద్రినాయుడు చెప్పారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

తిరిగి ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్!

▶ మొదటి పేజీ తరువాయి

జనంలోకి వెళ్లాలని పార్టీ నేతలు సూచిస్తున్నట్లు తెలిసింది.

రుణమాఫీ, రైతు బంధు వైఫల్యంపై..

రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ కష్టాలతోపాటు రుణమాఫీ జరగక పోవడం, రైతుబంధు ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతు సంక్షేమం కేంద్రంగా అమలు చేసిన కార్యక్రమాలను వివరించడంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలనే యోచనలో కేసీఆర్ ఉన్నారు. రుణమాఫీ, రైతు భరోసా అంటూ ఎన్నికల హామీలను ఉల్లంఘిస్తున్న వైనాన్ని కేసీఆర్ ఎండగట్టనున్నారు. దీని కోసం లోక్‌సభ ఎన్నికల ప్రచారం తరహాలో బస్సు యాత్ర పెట్టాలా లేక భారీ సభలు నిర్వహించాలా అనే కోణంలో పార్టీ నేతలతో చర్చిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ కేడర్, రైతులతో సభలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే కోణంలోనూ కసరత్తు జరుగుతోంది.

అమెరికా పర్యటనకు కేటీఆర్: కేటీ రామారావు బుధవారం రాత్రి అమెరికా పర్యటనకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి సోదరి కవితతోపాటు హైదరాబా ద్‌కు చేరుకున్న కేటీఆర్ కొద్ది గంటల వ్యవధిలోనే అమెరికాకు వెళ్లారు. తన కుమారుడు హిమాన్షుకు సంబంధించిన విద్యాపరమైన విషయాల కోసం అమెరికాకు వెళ్లి నట్లు సమాచారం. సెప్టెంబర్ రెండోవారంలో కేటీఆర్ తిరిగి హైదరాబాద్‌కు వస్తారని సమాచారం. ఇదిలా ఉంటే 'తండ్రి బాధ్య తల్లో అమెరికాకు వెళ్తున్నా' అనే అర్థం వచ్చేలా కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్‌పెట్టారు.

ఆడబిడ్డకు ఆత్మీయ స్వాగతం

- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కి చేరుకున్న కవిత
- ఆప్యాయంగా హత్తుకున్న కేసీఆర్

మర్కూక్/గజ్వేల్/సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ స్వాగతం లభించింది. మూడు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలై హైదరాబాద్‌కు చేరుకున్న కవిత గురువారం బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి భర్త అనిల్ కుమార్, కుమారుడితో కలిసి ఎర్రవల్లికి వెళ్లారు. ఎర్రవల్లిలోని నివాసానికి చేరుకున్న కవితను ఆమె తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆప్యాయంగా హత్తుకున్నారు. కేసీఆర్ పాదాలకు నమస్కరించి తండ్రి చేతిని కవిత ఆప్యాయంగా ముద్దాడారు. కేసీఆర్ పాదాలకు కవిత నమస్కరిస్తున్న సమయంలో ఎర్రవల్లి నివాసంలో ఉద్విగ్న వాతావరణం కనిపించింది. పలువురు మహిళలు కవితకు దిష్టితీసి మంగళహారతులతో స్వాగతం పలికారు. అప్పటికే ఫామ్‌హౌస్‌లో ఉన్న ఎంపీ జోగినపల్లి సంతోష్, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, మాజీ టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, మాజీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కూడా కవితకు స్వాగతం పలికారు. కవిత రెండు గంటలకుపైగా ఫామ్‌హౌస్‌లో గడిపి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

జిల్లా వార్తలు

ఆశలు ఆవిరైనట్లే...

- మిర్చి నిల్వ చేసినా దక్కని ఫలితం
- సీజన్‌తో పోలిస్తే క్వింటాకు రూ.5వేలకు పైగానే నష్టం
- విదేశీ ఎగుమతులు లేక ధరపై ప్రభావం
- పునరావృతమైన 2011 నాటి పరిస్థితి



ఎగుమతి కోసం మిర్చిని గ్రేడింగ్ చేయిస్తున్న వ్యాపారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: కొన్నాళ్లు వేచి ఉంటే మిర్చికి మంచి ధర వస్తుందనే భావనతో నిల్వ చేసిన రైతులు, వ్యాపారుల ఆశలు గల్లంతయ్యాయి. సాధారణంగా పంటలకు అన్ సీజన్‌లో ధర పెరిగే అవకాశమున్నా, ఈసారి అలా జరగకపోవడం గమనార్హం. డిసెంబర్ నుంచి మే వరకు మిర్చి సీజన్‌గా, జూన్ నుంచి నవంబర్ వరకు అన్ సీజన్‌గా చెబుతారు. గత సీజన్‌లో మిర్చి రెండో కోత ఫిబ్రవరిలో చేతికి రాగా మార్చి, ఏప్రిల్‌లో నాణ్యత ఆధారంగా క్వింటాకు రూ.21వేల నుంచి రూ.22వేల ధర పలికింది. సీజన్ ముగిశాక ధర పెరుగుతుందని నిల్వ చేస్తే... ఆనాటి ధర కూడా రాకపోవడంతో భారీగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

ధర తగ్గి.. నిల్వ భారమై

గత ఏడాది అన్ సీజన్‌లో మిర్చి ధర రూ.24 వేల మేర పలికింది. అదే నమ్మకంతో ఈసారి దాదాపు 40 లక్షల మిర్చి బస్తాలను రైతులు, వ్యాపారులు నిల్వ చేయగా.. ప్రస్తుతం 28లక్షల నుంచి నుంచి 30లక్షల బస్తాల మేర నిల్వ ఉన్నాయి. కానీ గత ఏడాది మాదిరి పరిస్థితులు లేక నిల్వ చేసిన క్వింటాకు రూ.5వేల నుంచి రూ.6వేల మేర నష్టాన్ని చవిచూడాల్సి వస్తోంది. సీజన్‌లో రూ.21వేల నుంచి రూ.22వేల వరకు ఉన్న ధర ఇప్పుడు రూ.17వేల నుంచి రూ.18 వేల వరకే పలుకుతోంది. ఫలితంగా రూ.4వేల వరకు నష్టపోగా.. నిల్వ చేసినందున రూ.600, తరుగు రూ.500, హమాలీ ఖర్చులు రూ.300, వడ్డీ రూ.300, రవాణా తదితర ఖర్చులు రూ.200 మేర కలిపితే క్వింటా మిర్చికి రూ.6వేల వరకు నష్టం ఎదురవుతోందని చెబుతున్నారు.



విక్రయాల సందడి కానరాని కోల్డ్ స్టోరేజీ

'తేజా'ను పోలిన రకాలు

విదేశీ ఎగుమతులు లేకపోవడమే మిర్చి ధర పడిపోవడానికి కారణంగా వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు పరిసర జిల్లాల్లో పండించే 'తేజా'రకం మిర్చికి చైనా, థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో డిమాండ్ ఉంటుంది. అయితే, ఈ ఏడాది తేజాను పోలిన ఇతర రకాల మిర్చి పలు రాష్ట్రాల్లో అందుబాటులోకి వచ్చింది. పశ్చిమబెంగాల్‌లో సుందరి, ఉత్తరప్రదేశ్‌లో బరెల్లి, కర్ణాటకలో బాడిగె తదితర రకాల ధరలు రూ.12వేల నుంచి రూ.13వేల వరకే వస్తుండడంతో ఎగుమతిదారులు అటే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా క్వింటాకు రూ.20వేల పైన ధర పలికే తేజా రకానికి డిమాండ్ తగ్గిందని తెలుస్తోంది.

13ఏళ్ల క్రితం ఇలాగే...

అన్ సీజన్‌లో మిర్చి ధర పతనం అనేది 13 ఏళ్ల తర్వాత పునరావృతమైంది. 2011లో పంట సీజన్‌లో మిర్చి ధర రూ.9వేల నుంచి రూ.10 వేల వరకు పలకగా రైతులు నిల్వ చేశారు. కానీ అన్ సీజన్ కొచ్చేసరికి రూ.4వేల నుంచి రూ.6వేల మధ్యే పలకడంతో విపరీతమైన నష్టం ఎదురైంది. ప్రస్తుతం పరిస్థితుల్లో రైతులు, వ్యాపారులు ఆనాటి పరిస్థితులను గుర్తుచేస్తున్నారు.


55 క్వింటాళ్లు నిల్వ చేశా...



నాలుగు ఎకరాల్లో మిర్చిని సాగు చేయగా.. రెండో కోత 55 క్వింటాళ్లకు మంచి ధర వస్తుందని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశా. అప్పట్లో క్వింటా రూ.21,800కు ఉండగా.. ఇప్పుడు రూ.18 వేల ధరే ఉంది. ధర పెరుగుతుందనుకుంటే తగ్గింది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– ఎలకొండ శ్రీను, కొక్కిరేణి, తిరుమలాయపాలెం మండలం


ధర వస్తుందనే నమ్మకంతో...



అన్ సీజన్‌లో ధర వస్తుందని 50 బస్తాల మిర్చిని నిల్వ చేశా. అప్పుడు రూ.22వేలు ఉన్న ధర పెరుగుతుందని అనుకుంటే రూ.18 వేలకు మించి ధర లేదు. అయినా వ్యాపారులు కొనుగోలు చేయడంలేదు. ఖర్చులన్నీ కలిపి క్వింటాకు రూ.5వేలకు పైగా నష్టపోవాల్సి వస్తోంది.

– ఇనుకుర్తి బ్రహ్మారెడ్డి, పందిళ్లపల్లి, చింతకాని మండలం

అంచనాలు తలకిందులు..



విదేశాలకు తేజ రకం మాత్రమే ఎగుమతి అయ్యేది. వివిధ రాష్ట్రాల్లో తేజాను పోలిన రకాలు తక్కువ ధరకే వస్తుండడంతో ఇక్కడ ధరపై ప్రభావం పడింది. అంతేకాక విదేశీ ఎగుమతులు మందగించాయి. అక్కడ నిల్వలు ఉండడంతో ఆశించినంత మేర ఎగుమతులు లేవు.

– యర్లపల్లి సతీష్‌కుమార్, చాంబర్ మిర్చి శాఖ కార్యదర్శి

అటు మున్సిపాలిటీ, ఇటు పంచాయతీ

- జీసీసీ బంక్ ఏర్పాటుకు దక్కని ఎన్‌ఓసీ
- ఫలితంగా కబ్జా అవుతున్న ప్రభుత్వ స్థలం



పాల్వంచలోని జీసీసీ కార్యాలయం

పాల్వంచరూరల్: పాల్వంచలో గిరిజన సహకార సంస్థ(జీసీసీ) స్థలంలో పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు నిర్ణయించినా సరిహద్దు సమస్యతో ఏళ్ల తరబడి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసీ) అందడం లేదు. ఫలితంగా జీసీసీ ఆదాయం కోల్పోతుండగా విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతోంది. పాల్వంచలోని జీసీసీ బ్రాంచ్ మేనేజర్ కార్యాలయం పరిధిలో నాలుగు ఎకరాల 8 కుంటల స్థలం ఉండగా.. ఇది కొంత లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ, ఇంకొంత పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో ఉంది. ఈమేరకు కార్యాలయం పోగా ఖాళీస్థలంలో పెట్రోల్‌బంక్ ఏర్పాటుచేయాలని హెచ్‌పీఎల్ సంస్థను కోరగా 2019లో మంజూరు చేశారు. అప్పటి నుంచి ఎన్‌ఓసీ కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతుండగా ఎటూ తేల్చడం లేదు. ఇదేమిటని ఆరా తీయగా స్థలం కొంత మున్సిపాలిటీ పరిధిలో, ఇంకొంత జీపీ పరిధిలో ఉండడమే కారణమని తేలింది. ఈ విషయాన్ని ఐటీడీఏ పీఓల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు. ఇంతలోనే జీసీసీ పరిధిలోని కొంత స్థలంలో హమాలీ కాలనీకి చెందిన పలువురు రేకుల షెడ్లు వేయడంతో పాటు గుడి నిర్మించారు. దీంతో అధికారులు ఖాళీ చేసి బంక్ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కాగా, బంక్ ఏర్పాటైతే జీసీసీకి ఆదాయం సమకూరడమే కాక స్థానిక గిరిజన యువతకు ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు.

ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు



జీసీసీ స్థలం కబ్జా కాకుండా ప్రహరీ నిర్మించాలంటే రూ.7లక్షలకు పైగా వ్యయమవుతుంది. ఈవిషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతి వచ్చే వరకు రూ.50వేల వ్యయంతో ఇనుప కంచెతో ఫెన్సింగ్ వేయిస్తాం. అలాగే, బంక్ ఏర్పాటుకు ఎన్‌ఓసీ జారీలో సమస్యపై పీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. అటు మున్సిపాలిటీ, ఇటు జీపీ ద్వారా రెండు సర్టిఫికెట్లు తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాం.

– లక్ష్మాజీ, జీసీసీ బ్రాంచ్ మేనేజర్, పాల్వంచ

మకరతోరణం వితరణ



ఉద్యోగులకు మకర తోరణం అందజేస్తున్న దాతలు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలోని ఉపాలయమైన వేంకటేశ్వరస్వామికి భక్తులు గురువారం వెండి మకరతోరణం సమర్పించారు. భద్రాచలం తాత గుడి సెంటర్‌కు చెందిన చారుగుళ్ల పద్మ వెంకటరమణ – దీప్తి శ్రీదేవి దంపతులు రెండు కేజీల వెండితో చేయించిన రూ.1.80లక్షల విలువైన మకరతోరణం తయారు చేయించారు. ఈమేరకు పూజలు జరిపి ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబుకు అందజేశారు.

రుణమాఫీపై ప్రతిపక్షాల విమర్శలు తిప్పికొట్టాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: రైతుల రుణమాఫీపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నేలకొండపల్లిలో గురువారం ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేసిందని తెలిపారు. అయితే, కొందరికి సాంకేతిక కారణాలతో జమ కాకపోయినా సర్వే చేయిస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ తట్టుకోలేని ప్రతిపక్షాల నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నందున కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆతర్వాత పలువురు కార్యకర్తలతో నాగేశ్వరరావు పలు అంశాలపై చర్చించారు. నాయకులు బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, కె.నాగేశ్వరరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, అంజిని, కడియాల నరేష్, నాగేంద్ర, సాయినవీన్, విజయ్, పగిడికత్తుల సుదర్శన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై 1 నుంచి ఆందోళనలు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలతో పాటు సింగరేణిలో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల సాధన కోసం సెప్టెంబర్ 1 నుంచి ఆందోళనలు నిర్వహించాలని నాగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన సమావేశాల్లో నిర్ణయించినట్లు బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ తెలిపారు. కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 10వ తేదీ వరకు ప్రతీ గనిలో గేట్‌మీటింగ్‌ల నిర్వహించడంతో పాటు 26న జీఎం కార్యాలయాల వద్ద ధర్నాలు, 30న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపడుతామని పేర్కొన్నారు. ఈమేరకు కార్మికులు సంఘాలకతీతంగా హాజరు కావాలని కోరారు. వేజ్‌బోర్డ్ ఒప్పందాలు అమలు, అన్ని ఏరియాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు చేయడంతో పాటు సీఎంపీఎఫ్‌లో అవినీతి విచారణ జరిపించాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ ఆందోళనలు జరుగుతాయని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు జీ.వీ.కృష్ణారెడ్డి, టీఎస్.పవన్‌కుమార్, రాంసింగ్, మొగిలిపాక రవికుమార్, ఊట్ల గణేష్, వి.నాగప్రసాద్, ఐ.నాగేశ్వరరావు, జి.వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల డంప్ లభ్యం



స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల డంప్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో భద్రత బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన ఐఈడీ బాంబ్‌ను బలగాలు నిర్వీర్యం చేయగా, మరోచోట భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి. సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్‌చవాన్, అధికారుల ఆధ్వర్యాన కుంట, కిష్టారం ఏరియాలో కూంబింగ్ చేపట్టారు.చింతగుఫా క్యాంపు నుంచి పటాదులాడ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలిస్తుండగా బలగాలను హతమార్చేందుకు మావోయిస్టులు అమర్చిన ఆరు కిలోల పైపు బాంబును గుర్తించి నిర్వీర్యం చేశారు. అలాగే, కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి డబ్బుమార్క క్యాంప్ నుంచి భద్రత బలగాలు ఛోటేకెడ్వాల్, సింగనమడ్గు, కమరం అటవీ ప్రాంతాల్లో గాలిస్తుండగా వీరిని చూసి మావోయిస్టులు పారిపోయారు. అనంతరం చెట్ల పొదల మధ్య దాచిన డంప్‌ను గుర్తించాయి. ఇందులో భారీ సంఖ్యలో తుపాకులు, డిటోనేటర్లు, మందులు, తుపాకీ తదితర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.